బడితపూజ చేసే భార్యనుంచి విడాకులు కోరిన అతడి కోర్కె ఏమైంది?

# ఇచ్ఛాపురపు రామచంద్రం కథ

## టెంకిజెల్ల

కోర్టు

జడ్జి వొచ్చి ఆసనాన్నలంకరించారు. లాంఛనాలు ముగించి తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు బెంచి క్లర్కు.

న్యాయమూర్తి కేసుకు సంబంధించిన న్యాయవాది వేపు చూసారు ప్రారంభించమన్నట్లు.

లాయర్ లేచినిలుచుని—''యువరానర్! మాక్లయింటు స్వయంగా చెప్పుకోవాలని అభిలషిస్తున్నాడు—'' అన్నాడు.

అలాగే అన్నట్లూ అనుమతిస్తున్నట్లూ తల ఊపి—ఫిర్యాదివేపు చూస్తూ అడిగాడు జడ్జి. ''మీ పేరు''

''భజగోవిందం.''

''ఏం చేస్తుంటారు!''


చెప్పాడు ఫిర్యాది.

''మీ ఫిర్యాదేమిటి?''

''నాకు విడాకులు కావాలి. నా భార్యనుంచి విముక్తి స్వేచ్ఛా కావాలి.'' గొణిగాడు. న్యాయాధీశులు ఆశ్చర్యపోయారు. ''మీరెందుకని విడాకులు కోరుకుంటున్నారు?''

భజగోవిందం సిగ్గుపడుతూ తల వొంచుకున్నాడు. ''అది.. ఆ విషయంలో... నేను మీకు రహస్యంగా చెప్పాలని..''

జడ్జి కరుణించినట్లు—''దగ్గరగా వొచ్చి చెప్పండి.'' అన్నాడనుమతిస్తూ. భజగోవిందం జడ్జగారి బల్లముందుకు నడిచాడు. ఇప్పుడు వారి మాటలొకరి వొకరికి మాత్రమే వినపడతాయి. ''మీరెందుకు విడాకులు కోరుతున్నారు!'' ''నాభార్య పెడుతున్న చిత్రహింస భరించలేక.'' గద్గదికమైందతని కంఠం.



''ఏమిటా విచిత్ర హింస?''

''యువరానర్! మనం మగవాళ్ళం. పక్షానికో నెలకో మన నెత్తిమీద జుత్తు తెగ పెరిగిపోతుంది గడ్డి దుబ్బుల్లాగ. ఫ్యాషన్ కుర్రాళ్ళ సంగతి వదిలేస్తే—మన బోంట్లకి సకాలంలో క్షవరం చేయించుకోకపోతే—మెడ వెనుకా అక్కడా మహా చికాకుగా ఉంటుంది . ఎంతో చీదరగా అనిపిస్తుంది అసౌకర్యంగా,

అసహ్యంగా ఉటుంది. క్షవర కళ్యాణ ముహూర్తం ఏ కారణాల వల్ల నేనా నాలుగు రోజులాలశ్య మయిందో— నరక యాతనే. వేసవయితే మరి చెప్పనే అక్కర లేదు. ఏమంటారు?''

''మీ కష్టాన్ని గుర్తించమూ, అర్థం చేసుకోడమేకాదు, అనుభవంకూడా ఉంది కనుక మీ మాటలతో పూర్తిగా అంగీకరిస్తున్నాను. కాని—మీ క్షవర కళ్యాణానికీ, విడాకులకీ సంబంధం మాత్రం ఊహకందడంలేదు.''

''అక్కడకే వొస్తున్నాను యువరానర్, నిర్మొహమాటంగా...నిష్కర్షగా...శుభ్రంగా... కేశాలను కోయించుకుని... జుత్తు కంట కత్తిర వేయించుకుంటే—బుర్ర తేలిక పడి... ఫ్రెకు గాలి తరుగులు మహా హాయిగా ఉంటుంది — వేసవిఎండలో గంటల తరబడి తిరిగొచ్చి బూట్లు, సాక్సు, టోపీ తీసేసి నప్పటిలాగా...''

''ఊఁ.''

''పదిహేనిరవై రోజుల కోసారి క్షవరానందం పొందడం నాకు చిన్నప్పటినుండి అలవాటు. నిజం చెప్పొద్దు—నాకు మట్టుకు—క్షవరం కళ్యాణమే. క్షవరం చేయించుకొచ్చి తలమీంచి చన్నీళ్ళుపోసుకుంటూ చేసే స్నానంలోని సుఖం అత్యంత మధురానుభవమే మగవాడికి.''

ఇక ఓపిక పట్టలేకపోయినట్లున్నారు న్యాయమూర్తి.'' అదంతా సరే. దానికీ మీ విడాకులకీ సంబంధ ఏమిటో సూటిగా చెప్పండి.'' విసుక్కున్నారు. ''అదిగో అప్పుడే యువరానర్... నేను భార్యా బాధితుడినీ, పత్నీ పీడితుడినీ కావడం మొదలయ్యింది. మా ఆవిడ... అదో రాలుగాయి...రణపెంకి, మాటకారీ, మహమ్మారీ... కొంటిదీ, కోణంగిది. నేను క్షవరం చేయించుకుని స్నానం చేసి తలతుడుచుకుంటు వస్తుంటే... .'' సిగ్గుపడిపోతూ... తల వొంచేసుకుని... గుస గుసలాడుతున్నట్లు... గొణిగాడు—'' కొత్తెంమీద ఠఫీమని ఓ టెంకి జెల్ల యిస్తుంది. అబ్బ! ఎంత గట్టిగా... శబ్దం వచ్చేలా యిచ్చుకుంటుందనీ ఆ టెంకిజెల్ల!''

త్రుళ్ళిపడ్డారు జడ్జి. కుర్చీలోంచి ముందుకి వంగార ప్రయత్నంగానే.

భజగోవిందం మళ్ళీ సాగించాడు.'' వొద్దే... తప్పే... మొగుణ్ణోమాట నొచ్చుకాని చెయ్యిచేసుకోకూడదే. సూర్యకాంత మయినా సినిమాలో మొగుణ్ణి సాధించుకు తినడం తప్ప కొట్టడం చేసిందా? నువ్వే ఆలోచించి. మొగుణ్ణి మొట్టికాయ మొట్టడం కాని... టెంకి, జెల్లిచ్చుకోడంకాని పతివ్రతా ధర్మాలు కావే—అని

నేను మొరపెట్టుకుంటే—నా ప్రార్థనని పెడచెవిన పెట్టేసి—

''మగాళ్ళు క్షవరం చేయించుకున్నానాడు అదోలా... తమాషాగా... అసయ్యంగా... . బలేగా ఉంటారు. అందుకే క్షవరం కొత్తెన్ని చూసేసరికెటువంటి వారికయినా టెంకిజెల్లిచ్చే బుద్దేస్తుంది. అలా జెల్ల లాగుతుంటే ఎంత సర్దాగా ఉంటుందో! మా అన్నలకీ తమ్ముళ్ళకీ యిచ్చేదాన్ని కదూ నాకు పెళ్ళి కాక ముందు? వాళ్ళు మీలాగ బాధపడిపోయి ఏడుపుముఖం పెట్టేవారు కారూ!

మీరే వారూ ఏమన్నా అనుకుని ఏడ్చిపోతారని కానీ మీ స్నేహితులు క్షవరం చేయించుకున్న నాడొచ్చినా వొక్క టెంటి జెల్లిద్దామని ముచ్చటపడిపోతుంది నా మనసు.

మేమే కదా మగాళ్ళం, మాకే కదా క్షవరయోగముందని గొప్పయిపోకండి. కావాలంటే...నేను కాదంటే అడగండి. క్షవరం జెల్లకే అంతయిదియిపోతారేం?'' అంటూ ఎదురుతిరిగి మరో టెంటికి జెల్లేస్తుంది ఫట్‌మంటు—కొత్తెం మీద. తను రోజంతా క్షవరం జెల్లలు కొట్టచ్చుకదాని— నమ్ము—వారానికే, పదిరోజులకీ కూడా క్షవరానికి తరుముతుంది. పోనీ ఓ జెల్లతో సరిపెడుతుందా అంటే అబ్బే... ఆరోజంతా నేనంకితే చాలు టెంకిజెల్ల కొట్టితీరిందే. పక్కనెవరున్నారనేది కూడా చూడదు. సమయమూ సందర్భమూ మంచీ చెడ్డా ఏవీ గమనించదు. పిల్లలముందు... స్నేహితుల ముందు.... నేనిప్పటికెన్ని క్షవరం జెల్లలుతిన్నానో, నా పరువెంతపోయిందో! నేనెంత మగాడినయినా, పెళ్ళయిపోయినవాడినయినా నాకూ ఆత్మాభిమానముంది. పెళ్ళాం నుంచి టెంకిజెల్లలనూ క్షవరం జెల్లలను తప్పించుకుని... అవమానాలనుంచి బయటపడి... శేషజీవితమయినా ఆత్మాభిమానంతో... మనిషిగా... బతకాలనుకుంటున్నాను. అందుకావిడ నుంచి విడాకులు పొందడం వినా మార్గమేముంది? సహృదయంతోను సానుభూతితోను సాటి మగవాడిగా నన్నర్థం చేసుకోండి. నాకీ మాత్రపు అదృష్టమయినా ప్రసాదించరా యువరానర్?'' ఏడిచేశాడు భజగోవిందం.

'ఎంత అదృష్టవంతులు మీరు భజగోవిందంగారూ!'' ఒక్కసారాగి...'' ఇప్పటికే మీరెంతో అదృష్టవంతులు. నేను మీ కింకా ఏం అదృష్టం ప్రసాదించగలను?'' అన్నారు న్యాయమూర్తి. భజగోవిందం తెల్లబోయాడా మాటాలకి.

క్షవర క్షవరానికి కట్టుకున్న దానిచేత కందుజెల్లతో టెంకి జెల్లతో తినడం అదృష్ట



# ఫ్యాక్టరీ!

మన శరీరంలో వుండే భాస్వరంతో రెండువేల అగ్గిపుల్లల హెడ్స్, కొవ్వుతో ఏడు బారుల సోపులు, ఐరన్‌తో ఒక మేకు తేలిగ్గా తయారవుతాయట.

అంటే మన బాడీలోపల అన్ని కర్మాగారాలున్నాయన్న మాట. బాప్‌రే!

—నిషీ

మా! "ఒక్కటి నిట్టూర్పు నిట్టూర్చి... ముక్కు చీది... ఎగబీలుస్తూ మగవాడికి మగవాడే శత్రువని నిరూపిస్తున్నారు యువరానర్, మీరు అంతేలెండి, మెత్తటి వాడిని, తాజాగా క్షవరం చేయించుకున్నావాడినీ చూస్తే ఎవరికైనా టెంకిజెల్లలాగ బుద్ధి. మగబతుకింతే.. ఇంతే" అని వాపోయాడు.

"చూడండి భజగోవిందంగారూ! మీరు తొందరపడి అపార్థం చేసుకున్నారు నన్ను. క్షవరం — ఎంత తరచయినా పదిరోజులకో పదిహేనురోజులకో ఓసారి. అంతేనా?"

"అంతేను" వొప్పుకున్నాడతను.

"మరి గెడ్డమో? నాలాటి పెద్ద ఉద్యోగుయిన కొందరు మగాళ్ళకి గెడ్డంకోత దైనందిన కార్యక్రమం. కొందకచో—రోజుకి రెండేసి సార్లు కూడా..."

"జీనట. కొందరు సాయంత్రం కూడా గెడ్డం గీసుకుంటూంటారుట—"

"గెడ్డం గీసుకోగానే— అబ్బ! మీ చెంపలెంత నున్నగా మెరుస్తున్నాయి!

మీ చెక్కిళ్ళద్దంలో ఎంతలా నిగ నిగలాడుతున్నాయి! మెత్తని వారిని చూస్తే మొత్తబుద్ధవుతుందో కాదో కాని—మెరిసే చెంపలని చూస్తుంటే చెంప దెబ్బ వెయ్యబుద్దే. లెంపకాయలాగ బుద్దే. ఇలాటి తాజా చెంపలని చూస్తూ చేతులు ముడుచుకు కూర్చోడం నా తరం కాదు బాబూ. అయినా మీరేమయినా పైవారా? నా మొగుడు... నాఇష్టం... " అంటూ తపతప...ఎడాపెడా...ఆ చెంపా ఈ చెంపా... ముద్దుకు అయితేమాత్రం... లెంపకాయలు లాగేసే అల్లరి, ఆగడపు అర్థాంగి పొందబడకపోవడం మీఅదృష్టమూ పూర్వ జన్మ పుణ్యమూ కాదంటారా?" అంటూ చెంపలని నిమురుకుంటున్న ఆయనను చూసేసరికి.

"మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా అసూయగా ఉంది భజగోవిందంగారూ!" అంటున్న జడ్జిగారి మాటలు వినేసరికి—అతనికి చాలా కథ అర్థమై పోయినట్లు తను నిజంగా అదృష్టవంతుడే అని అనిపించింది.

"క్షవరాల కంటె గెడ్డాల సంఖ్యా తరుచుదనమూ ఎక్కువ. కనుక క్షవరం టెంకిజెల్లల కంటె గెడ్డం చెంపదెబ్బల సంఖ్యా తరుచుదనమూ ఎక్కువ టెంకి జెల్ల కంటె చెంప దెబ్బ మోటూ ఘాటూ ఎక్కువ ఎంత జడ్జయినా మగాడే మొగుడే కనుక ఆవిడికి లోకువ. ఆయన పరిస్థితి కంటే నాపరిస్థితే నయం." అనుకుంటూ.... జడ్జిగారి మీద జాలిపడుతూ... విడాకుల అభ్యర్థనను విరమించుకున్నట్లు చెప్పేసి— కోర్టునుంచి వెళ్ళిపోతున్న భజగోవిందాన్ని చూసి నవ్వుకున్నారు జడ్జి.

ఆయనకప్పటికే చక్కని సమయస్ఫూర్తి కలవారన్న పేరుంది కానీ—అప్పటికప్పుడూ అక్కడికక్కడే కథ చెప్పేసి.. కథానుగుణంగా నటించేసి... కేసుని విరమింపజేయించడం మాత్రం ఆయన సర్వీసులో అదే మొదటిసారి.